క్లుప్తంగా

గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు


మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం ఆర్.శ్రీనివాసులు

కావలిరూరల్: శైవ క్షేత్రం అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు కావలి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని మేనేజర్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5న ఉదయం 8 గంటలకు కావలిలో బస్సు బయలుద్దేరి రాత్రికి అరుణాచలం చేరుతుందని, గిరి ప్రదక్షిణ అనంతరం తిరిగి బయలుద్దేరి 6వ తేదీ సాయంత్రానికి కావలికి చేరుకుంటుందన్నారు. ఈ సర్వీసుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీఎంకే ట్రస్ట్ సేవలు అభినందనీయం


కూలింగ్ మినరల్ వాటర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ భారతి

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ రాపల్లి భారతి అన్నారు. ఆమె బుధవారం గ్రామ పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో దివంగత గుంటుపల్లి కొండయ్యచౌదరి–సుబ్బమ్మ జ్ఞాపకార్థం జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ముందస్తుగా ప్రయాణికుల, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చల్లని నీటిని ట్రస్ట్ ద్వారా సరఫరా చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు జి.అమర్‌నాథ్‌రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద పిల్లలకు బాసటగా నిలవాలి


పేద పిల్లలకు నూతన వస్త్రాలు అందిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

కావలిరూరల్: నిరుపేద పిల్లలకు బాసటగా నిలుస్తూ వారిని అన్ని విధాలా ఆదుకోవడం అభినందనీయమని కావలిరూరల్ సీఐ రాజేష్ తెలిపారు. పట్టణంలోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలోని సంయుక్త సేవా సంస్థ సంరక్షణలో ఉన్న 22 మంది పిల్లలకు నూతన వస్త్రాలు, భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంయుక్త సేవ సంస్థ ద్వారా పట్టణంలో పేద ప్రజలు అనేక విధాలుగా ఆదుకుంటూ వారికి అండగా నిలుస్తున్న సంస్థ అధ్యక్షుడు సురేంద్రను అభినందించారు. కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న అయోధ్య సమాజం కోసం తన వంతు బాధ్యతగా పేద పిల్లలకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పిల్లలకు వస్త్రాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, షేక్ మహబూబ్‌బాషా, విశ్రాంత ఉపాధ్యాయులు రఘుకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం


శ్రీరామనవమి ఉత్సవాల అంకురార్పణకు పుట్టమట్టిని తీసుకొస్తున్న ఉభయకర్తలు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో బుధవారం బెస్తరాజుల ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ, హనుమంత సమేత కోదండరామస్వామి దేవాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా ప్రారంభించారు. ప్రతి ఏటా ఉగాది రోజు నుంచి శ్రీరామనవమి వేడుకలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. మహిమలూరులో ఈ ఆలయం పరిధిలోని ఉభయకర్తలు శ్రీరామనవమి వేడుకలు పూర్తి చేసిన అనంతరం పడమర వీధిలో ఉన్న కోదండ రామస్వామి దేవాలయం ఉభయకర్తలు 9 రోజుల పాటు శ్రీరామనవమి వేడుకలను నిర్వహిస్తారు. నవమి ఉత్సవాల ప్రారంభ సూచకంగా భక్తులు పుట్ట మట్టిని తీసుకొచ్చి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. అనంతరం నటరాజ కులుకు చెక్క భజన, స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అకాల నష్టం

అకాల వర్షాలు అన్నదాతకు నష్టాన్ని మిగిల్చాయి. అన్ని రకాల పంటలు చేతికొచ్చే సమయంలో ఈదురుగాలులు, వడగళ్ల వానలు రైతులకు కష్టాన్ని తెచ్చిపెట్టాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రెండే రోజుల్లో నేల, నీళ్ల పాల్జేసింది. ప్రధానంగా వరితో పాటు మామిడి, మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడిప్పుడే వరి కోతలు ప్రారంభమవుతున్నాయి. కొన్ని చోట్ల కళ్లాల్లోనే ఉన్న ధాన్యం తడిచిపోయింది. నిలువు మీద ఉన్న వరి నేలకొరిగింది.

- వరి, మామిడి, మిర్చి రైతులకు కడగండ్లు
- కొన్ని చోట్ల కళ్లాల్లోనే తడిచిన ధాన్యం


మామిడి తోటను రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారిణి సుధామయి

కావలి: ప్రకృతి ప్రకోపానికి ఆరుగాలం శ్రమించే రైతులు బాధితులయ్యారు. కావలి నియోజకవర్గంలో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన పంటలను నాశనం చేసింది. ప్రధానంగా వరి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. మామిడి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షానికి అన్నదాతలకు కోలుకోని నష్టాన్ని మిగిల్చింది.

ఈ ఏడాది రబీ సీజన్‌లో వాతావరణం అనుకూలించడం, ప్రభుత్వం నుంచి సహకారం ఉండడంతో కావలి నియోజకవర్గంలో కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల్లో సుమారుగా లక్ష ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పుడిప్పుడే కోతలు ప్రారంభమవుతున్నాయి. ప్రస్తుతానికి 20 శాతం కూడా వరి కోతలు పూర్తి కాలేదు. మిగిలిన రైతులు కూడా కోతకు సిద్ధమవుతుండగా, ప్రకృతి ప్రకోపానికి కురిసి వడగళ్ల వాన చేతికి వచ్చిన పంటలను దెబ్బతీసి కడగండ్లను మిగిల్చింది.

నష్టాల అంచనాల్లో వ్యవసాయశాఖ

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను పారదర్శకంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వరి పైరు ఎక్కడెక్కడ ఎంత మేరకు నష్టం జరిగిందో వివరాలు సేకరిస్తున్నారు. ఈదురుగాలులకు వరిపైరు నేలకు ఒరిగిపోగా, వాటిపై వడగల్లు పడటంతో గింజలు రాలిపోయాయి. ఇక వానకు కయ్యల్లో నీరు చేరడంతో రాలిన గింజలు నీటి మడుగులో పడిపోయాయి. కాలువల్లో నీరు పుష్కలంగా ఉండడంతో కయ్యల్లో నుంచి నీరు బయటకు పోయే మార్గం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ప్రాథమికంగా నష్టం అంచనాలు రూపొందించిన అధికారులు ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పక్కాగా నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు.

మామిడి, మిర్చి రైతులు విలవిల

కావలి నియోజకవర్గంలో సుమారు 3,500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న మామిడి తోటను చూసి వ్యాపారులు కొనుగోలు చేసుకోవడానికి ఒప్పందాలు చేసుకుంటారు. ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానతో పిందెలతో పూత కూడా పూర్తిగా రాలిపోయింది. దీంతో ఈ ఏడాది వ్యాపారులు ధరలు తగ్గిస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 400 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. ఈదురు గాలతో కూడిన వడగండ్ల వానకు చెట్లు విరిగిపోయాయి. కొన్ని చోట్ల నేలవాలిపోయాయి. వాటిని నిలబెట్టేందుకు రైతులు కూలీలతో శ్రమిస్తున్నారు. చెట్లు వేర్లు కదలి ఉంటే ప్రతికూల పరిస్థితులు ఉంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


ఈదురుగాలులకు ఒరిగిపోయిన వరి పైరు

వడగండ్లు ముంచింది



ఈదురు గాలులు, వాన అయి ఉంటే పర్వాలేదు. వడగండ్లు మమల్ని ముంచేసింది. వరి ఇంకో రెండు రోజుల్లో కోత కోయాలని అన్ని ఏర్పాట్లు చేసుకున్నాను. ఇంతలో వడగండ్లతో కూడిన వాన వల్ల బాగా నష్టపోయాను. ఎకరాకు కనీసం 10 బస్తాలు కూడా వచ్చేటట్టు లేదు. కనీసం పెట్టిన పెట్టుబడి వడ్డీ కూడా రాదు.

– చిమ్మిలి వెంకటేశ్వర్లు, రైతు, కొత్తపల్లి, కావలి మండలం

పంట నష్టం అంచనాలు తయారు చేస్తున్నాం



వరి పైరుకు జరిగిన నష్టాన్ని అంచనా వేసే పనిలో ఉన్నాం. ప్రాథమికంగా నష్టం వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేశాం. అయితే నిర్దిష్టమైన అంచనాలు తయారు చేసి నివేదికల రూపంలో అందజేయాలని ఆదేశాలు రావడంతో గ్రామాల్లో ఆర్‌బీకే కేంద్రాల్లో ఉన్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులను కలిసి నష్టం వివరాలను నమోదు చేస్తున్నారు.

– కె.కన్నయ్య, ఏడీఏ, కావలి

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు


ఆత్మకూరు: విశేష అలంకరణలో అలఘునాథ స్వామి

ఆత్మకూరు: తెలుగువారి తొలి పండగ ఉగాదిని పట్టణంలోని వేడుకగా నిర్వహించారు. వేకువజామునే తలంటు స్నానాలు చేసి నూతన బట్టలు ధరించి దేవాలయాలకు దర్శనం కోసం తరలి వెళ్లారు. శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి ఆలయం, కోదండరామాలయం, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర ఆలయం, కాశీనాయన ఆశ్రమం, జేఆర్‌పేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయం తదితర దేవాలయాల్లో భక్తులు దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉండడం కనిపించింది. ప్రత్యేక పూజలు అనంతరం కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం ఆయా దేవాలయాల నిర్వాహకులు ఉగాది పచ్చడి ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం దేవాలయాల్లో నూతన పంచాంగాన్ని అర్చకులు శ్రవణం చేసి వినిపించారు. భవిష్యత్‌లో పాడి పంటలు వర్షాలు కురిసే విధం ఎలా ఉండనుందని, తదితర వాటి గురించి రైతులు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం


ప్రతిభా పురస్కారం అందుకుంటున్న మోహన్

సంగం: మండలంలోని దువ్వూరు జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగుస్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తాటికొండ మోహన్‌కు ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాన్ని బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా నెల్లూరు రోటరీ క్లబ్ ద్వారా అందజేశారు. ఈ పురస్కారం అందుకోవడంతో పలువురు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మోహన్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా ఉగాది సంబరాలు

- గంగమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్న జేసీ


గంగమ్మ తల్లిని దర్శించుకున్న జేసీ కుటుంబ సభ్యులు

సోమశిల: అనంతసాగరం మండలం గుడిగుంటలో కొలువైన గంగమ్మ తల్లి ఆలయంలో ఉగాది పర్వదిన వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. జేసీ రోణంకి కూర్మనాథ్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అల్లంపాటి పెంచలరెడ్డి జేసీ కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో సాదరణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వేడుకగా పంచాంగ శ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సోమశిలలోని కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధాన అర్చకులు సొట్టు చంద్రమౌళిశర్మ శోభకృత్ నామ పంచాంగ శ్రవణం చేశారు. నూతన సంవత్సరంలో వ్యవసాయ వాణిజ్య, విద్య, రాజకీయ, వాతావరణ పరిస్థితులపై కూలంకుషంగా వివరించారు. ఈ ఏడాది పసిడి పంటలు వెల్లువెత్తుతాయని వివరించారు. రాష్ట్రం సమృద్ధిగా విరాజిల్లుతుందన్నారు. అనంతరం నక్షత్ర, రాశుల వారీగా ఆదాయ, వ్యయాలను వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కమనీయం.. వెంగమాంబ కల్యాణం


కల్యాణ వేదికపై వెంగమాంబ-గురవయ్య దంపతులు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో కొలువైన ఉన్న వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వెంగమాంబ అమ్మవారు–గురవయ్య దంపతులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వెంగమాంబ దంపతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణాన్ని కమణీయంగా నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దుత్తలూరులోని రామలింగేశ్వరస్వామి సన్నిధిలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

వన్యప్రాణులు వేటాడితే చర్యలు


గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

ఉదయగిరి: వన్యప్రాణులను ఎవరైనా వేటాడి మాంసం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్వో, శ్రీనివాసులు, ఎఫ్ఎస్ఓ. వెంకటయ్య హెచ్చరించారు. రేంజ్ పరిధిలో వన్యప్రాణులను వేటాడి మాంసం విక్రయాలు జరుపుతున్నారనే సమాచారం రావడంతో రేంజ్ అధికారి టి.ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాల్లో రెండు బృందాలుగా ఏర్పడి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఎవరైనా వన్యప్రాణులను వేటాడినట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. వేసవి దృష్ట్యా అడవి జంతువులు తాగునీటి కోసం గ్రామాల్లోకి వస్తుంటాయని, వాటిని గమనించి సమాచారం ఇవ్వాలన్నారు. అడవులకు నిప్పు పెడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, నాయబ్, లక్ష్మీప్రసన్న, ప్రసాద్, ఓంప్రకాష్, గౌతమ్, కరీముల్లా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లి వాశికి పురోహిత బ్రహ్మ బిరుదు


సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మధుసూదన శాస్త్రి

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లికి చెందిన చింతలపల్లి మధుసూదనశాస్త్రికి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన సర్ సీవీరామన్ అకాడమీ స్వర్ణ కంకణధారణతో పాటు పురోహిత బ్రహ్మ బిరుదును ఇచ్చి సత్కరించారు. డీసీపల్లికి చెందిన చింతలపల్లి మధుసూదనశాస్త్రి మర్రిపాడు మండలంతో పాటు పలు ప్రాంతాల్లో వేలాది వైదిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారని, అందుకు గుర్తుగా ఆయనకు స్వర్ణ కంకణంతో పాటు పురోహిత బ్రహ్మ బిరుదునిచ్చి సత్కరించారు. సర్ సీవీరామన్ అకాడమీ తరపున సినిమా నటుడు సుమన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. గ్రామానికి చెందిన మధుసూదనశాస్త్రికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చి అవార్డు అందజేయడంపై గ్రామస్తులు ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. సుమన్‌తో పాటు సర్ సీవీ రామన్ అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవానికి జలాభిషేకం

- 1001 కలిశ బిందెలతో మహిళలు ఊరేగింపు


కలిశ బిందెలతో ఊరేగింపుగా మహిళలతో కలిసి వస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని పెద్ద పవని రోడ్డులో కొలువైన గంగాభవానికి అమ్మవారికి బుధవారం ఉగాదిని పురస్కరించుకుని అత్యంత వైభవంగా జలాభిషేకం నిర్వహించారు. ప్రతి ఉగాదికి మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో 1001 కలిశ బిందెలతో ఊరేగింపుగా వచ్చి గంగాభవాని అమ్మవారికి జలాభిషేకం చేయడం ఆనవాయితీ. సకాలంలో వర్షాలు బాగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు చెల్లిస్తుంటారు. అందులో భాగంగా పాతవూరు శివాలయం నుంచి మహిళ భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలతో భారీగా 1001 కలిశ బిందెలతో గంగాభవాని అమ్మవారి ఆలయానికి చేరుకుని జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉగాదికి గంగాభవాని అమ్మవారికి మహిళలు అత్యంత వైభవంగా కలిశ బిందెలతో జలాభిషేకం నిర్వహిస్తారన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనిగర్ల మహేంద్ర యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు


కార్యాలయంలో ఉగాది పచ్చడి పంచుతున్న ఎమ్మెల్యే మేకపాటి

ఉదయగిరి: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం జరిగిన శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురికి షడ్రుచుల ఉగాది పచ్చడిని పంచి పెట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు నూతన సంవత్సరంలో సుఖసంతోషాలు, అష్టైశ్వరాలు, పాడి-పంటలతో సమృద్ధిగా ఉండాలని కోరారు. భగవంతుడు నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని ఆకాంక్షించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది సంబరాలు జరుపుకున్నారు. గ్రామాల్లో పౌరోహితుల వద్దకు వెళ్లి ప్రజలు నూతన సంవత్సరంలో ఆదాయ, వ్యయాలు, రాశిఫలాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అక్కి.భాస్కరరెడ్డి, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్బి ఎస్దానీ, ఎంపీటీసీ జి.తిరుపతి, నాయకులు జి.శ్రీనివాసులరెడ్డి, యు. శ్రీనివాసులు పాల్గొన్నారు.

మర్రిపాడులో..

మర్రిపాడు: మండలంలో బుధవారం తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక దేవాలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పూజారులు సాయంత్రం వేళ పంచాంగాన్ని చదివి వినిపించారు. ఆలయాల వద్ద ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. పంచాంగం తెలుసుకుంటూ తారాబలాలను వివరించారు. శ్రీరామనవమి వేడుకలకు ఆలయాన్ని సిద్ధం చేస్తున్నారు.

ఉత్సాహంగా ఉగాది వేడుకలు

వరికుంటపాడు: మండలంలోని పలుగ్రామాల్లో తెలుగు నూతన శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తెలుగు సంవత్సరం సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ఉగాది సందర్భంగా గతించిన తమ కుటుంబ పెద్దలకు కొత్త వస్త్రాలు పెట్టుకుని స్మరించుకున్నారు. గ్రామాల్లో పురోహితుల ఇళ్లకు చేరుకుని షడ్రుచులు కలిగిన ఉగాది పచ్చడి స్వీకరించి రాశిఫలాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు, విరువూరు, తూర్పురొంపిదొడ్ల, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

వింజమూరు: మండలంలో బుధవారం ఉగాది పండగను ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండ్‌లోని నాలుగు కాళ్ల మండపం వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉత్సవమూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ఉగాది పచ్చడి పంపిణీ

ఆత్మకూరు: తెలుగువారి తొలి పండగ ఉగాదిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) ఆధ్వర్యంలో పట్టణంలోని బీఎస్సార్ సెంటర్‌లో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి పలువురు ఉపాధ్యాయులు ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. తీపు, పులుపు, చేదు, వగరు షడ్రుచుల సమ్మేళనమే జీవిత సారాంశమని వాటిని గుర్తు చేసేందుకు పెద్దలు ఉగాది పచ్చడిని తీసుకునేలా చేశారన్నారు. ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, ఆర్‌వీ రమణారెడ్డి, పెంచలరెడ్డి, హరీష్‌కుమార్, సుసర్ల శ్రీనివాసులు, గడ్డం వెంకటేశ్వర రెడ్డి, నారాయణ రావు, పలు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అపస్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సంగం: శోభకృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా సంగంలోని సంగమేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

ఘనంగా తెలుగు సంవత్సరాది వేడుకలు

బిట్రగుంట: బోగోలు మండలంలో తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో వేకువ నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో సనాతన సంప్రదాయాన్ని అనుసరించి అర్చకులు ఇంటింటికీ తిరిగి షడ్రచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. 'శోభకృత్' నామ సంవత్సరంలో ప్రజలంతా పాడి పంటలు, ఆయురారోగ్యాలతో శోభిల్లాలని, సర్వశుభాలు కలగాలని ఆశీర్వదించి పంచాంగ పఠనం చేశారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానంతో పాటు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ఉగాది వేడుకలు కనుల పండువగా సాగాయి. క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామికి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, రాత్రికి సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించి పంచాగ శ్రవణం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.


ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజల్లో భక్తులు

అంగరంగ వైభవంగా గ్రామోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేటలోని లక్ష్మీ ఆండాళ్ సమేత వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. దశాబ్ద కాలంగా ఏటా ఉగాది రోజు ఆస్థానం నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించడం, పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ప్రత్యేక పందిర్లు ఏర్పాటు చేసి అక్కడ ఆస్థానం నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోంది. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి హనుమంత వాహనంపై వేంచేపు చేసి వివిధ పుష్పాలు, గజమాలలతో సుందరంగా అలంకరించారు. మహిళల కోలాట భజన, డీజే నృత్యాలు, ముందు సాగుతుండగా, మేళతాళాలతో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా ప్రారంభమైంది. బస్టాండ్ సెంటర్, మెయిన్ బజార్, హిల్ రోడ్డు మీదుగా గ్రామోత్సవం వైభవంగా సాగింది.

తెలుగుభారతి సేవా సమితి ఉగాది సంబరాలు


పలువురు ప్రముఖులను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో శుభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు వస్త్రాలు ధరించారు. కళాతపస్వి కాశీ విశ్వనాథ ప్రాంగణంగా పేరు పెట్టి ఉగాది సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు, శ్రీభారతి నృత్య విద్యాలయం నిర్వాహకురాలు అపర్ణ ఆధ్వర్యంలో బాలికలు చేసిన నృత్యాలు, పలు వేషధారణలు, హాస్య వల్లరి ఆహూతులను ఆకట్టుకున్నాయి. సభలో పలువురు కవితా గోష్టి చేశారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు, సేవా సమితి సీనియర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమవరపు సుబ్బరాయుడు, యానాదిరెడ్డి, టీసీవీ సుబ్బయ్య, రామయ్యస్వామి, సురేష్‌బాబు, రజనీ ప్రియ, అపర్ణ, శ్రీనివాసరాజు, తదితరులను ఘనంగా సన్మానించారు. నిర్వాహకులు రవి, నారాయణరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.